మైదానానికి.. మహర్దశ



ఇది కదా అభివృద్ధి



ఇందర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం

ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ సేడియంకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో మొదటి క్రీడా మైదానం అయిన ఈ గ్రౌండ్‌లో గవాస్కర్, కపిల్‌దేవ్, టెండూల్కర్ వంటి క్రికెట్ దిగ్గజాలు ఆడారు. నాడు గొప్పగా వెలుగొందిన ఈ మైదానం తర్వాతి కాలంలో తన ప్రాభవం కోల్పోయింది. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం ఈ స్టేడియం అభివృద్ధికి పెద్దపీట వేసి నిధులు విడుదల చేసింది.

నాడు
వన్‌టౌన్‌లోని ఇందిర ప్రియదర్శిని స్టేడియం తొలినాళ్లలో చక్కటి సేవలందించింది. గొప్పగొప్ప క్రికెట్ పోటీలు ఇక్కడ జరిగాయి. ఎన్నో రాజకీయ సభలు, సమావేశాలు నిర్వహించబడ్డాయి. అలాంటి స్టేడియం శిథిలమై ఎండకు ఎండి, వానకు తడుస్తున్నా ఎవరూ స్టేడియం రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నేడు
విశాఖకు మణిహారంలా ఒక వెలుగు వెలిగిన ఇందిర ప్రియదర్శిని స్టేడియంకు పూర్వ వైభవం కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. రూ. కోటీ 60 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టింది. దీంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే వర్ధమాన క్రీడాకారులకు మేలు జరుగుతుందంటున్నారు.



మరమ్మతులు జరుగుతున్న గ్యాలరీ

జోరుగా ఇందిర ప్రియ దర్శిని స్టేడియం అభివృద్ధి పనులు

జాతీయ స్థాయి క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు

ఆనందం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

జగదాంబ : గతంలో ఒక వెలుగు వెలిగిన ఇందిర ప్రియదర్శిని స్టేడియం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూలకు చేరింది. నాడు సభలకు మాత్రమే ఈ స్టేడియంను వినియోగించుకున్నారు. సదుపాయాల కల్పనకు ఆసక్తి చూపలేదు. దీంతో స్టేడియం శిథిలావస్థకు చేరుకుంది. గ్యాలరీ, డ్రెస్సింగ్ రూమ్‌లు మరమ్మతులకు చేరుకుని అందవిహీనంగా తయారయ్యాయి. స్టేడియం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి, మందుబాబులు, గంజాయి తాగే వాళ్లు, ఆకతాయిల అడ్డాగా తయారయింది.

చిన్నపాటి శిక్షణ శిబిరాలు..
ప్రస్తుతం స్టేడియంలోని గ్యాలరీ గదుల్లో కొందరు క్రీడాకారులు త్రోబాల్, కిక్ బాక్సింగ్, బాక్సింగ్, క్రికెట్ వంటి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ యువకులు, చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఈ స్టేడియంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరి ఇష్టారాజ్యంగా వారు వ్యవహరిస్తున్నారు. కొంత మంది స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి..
ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోటీ 60 లక్షలతో స్టేడియంకు పూర్వ వైభవం కల్పించేందుకు నడుం బిగించింది. పనుల కోసం నిధులు మంజూరు చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో నగర క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిర ప్రియదర్శిని స్టేడియం అభివృద్ధి ఇలా..

స్టేడియం అభివృద్ధికి రూ. 1.60 కోట్లు కేటాయింపు	రూ. 19.60 లక్షలతో గ్యాలరీల మరమ్మతు	రెండు పెవిలియన్ బాక్స్‌లకు రూ. 39.74 లక్షల కేటాయింపు
రూ.17.82 లక్షలతో జంగిల్ క్లియరెన్స్	రూ. 19.87 లక్షలతో ఇతర మరమ్మతులు	రూ. 31.65 లక్షలతో రెండు తారురోడ్ల నిర్మాణం
కాలువలకు రూ.18.57 లక్షల కేటాయింపు	17.25 లక్షలతో గ్యాలరీల దిగువన గల రూమ్‌ల మరమ్మతు	

కనుమరుగు అయిపోతుందనుకున్నాం..



మున్సిపల్ స్టేడియం ఇక కనుమరుగు అయిపోతుందనుకున్నాం. కేవలం సభలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. క్రీడల పరిస్థితి ఏమిటనే ఆలోచనలో పాతనగర క్రీడాకారులంతా ఆందోళన చెందేవారు. ఈ తరుణంలో మళ్లీ ఆశలు చిగురించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడలకు చక్కని తోడ్పాటు అందిస్తోంది.
–అనిల్, పాతనగరం

స్టేడియం అభివృద్ధితో క్రీడాకారులకు మేలు..



మున్సిపల్ స్టేడియంను మళ్లీ అభివృద్ధి చేస్తున్నారు. పాతనగరంలో ఎందరో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారు. అందుబాటులో చక్కని మైదానాలు ఉంటే ఆటగాళ్లకు ఎంతో వెసులుబాటుగా ఉంటుంది. స్టేడియం అభివృద్ధితో క్రీడాకారులకు జీవం పోసినట్లు అవుతుంది.
–కేశవ్, కిక్ బాక్సర్, జీవీఎంసీ 35వ వార్డు

సీఎం జగన్‌కు ధన్యవాదాలు..



స్టేడియం అభివృద్ధి జరిగితే క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఇంకా బాగా నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది. స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే బాగుంటుంది. చక్కటి నిర్ణయం తీసుకున్న జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– కావ్య, కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి

క్లుప్తంగా

కె.కె. రాజుకు ఎమ్మెల్యే వాసుపల్లి శుభాకాంక్షలు



విశాఖ ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
- డాబాగార్డెన్స్

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద, అచ్చియ్యమ్మపేటలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. తద్వారా సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించాలన్నారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందడం, పథకాలపై అవగాహన కల్పించడం, సమాచార వ్యాప్తి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.

బైబిల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

డాబాగార్డెన్స్ : బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా క్రిస్మస్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. రామ్‌నగర్‌లో గల బైబిల్ సొసైటీ హౌస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఆగ్జిలరీ కార్యదర్శి జాన్ విక్రమ్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో 150 రకాల బైబిల్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పి. ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగనన్న ధ్యేయం

- అందుకే ఏపీకి మళ్లీ జగనన్నే కావాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అల్లిపురం సచివాలయం పరిధిలో వలంటీర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పద్మావతి తదితరులు

అల్లిపురం : అవినీతి లేని పాలన కొనసాగిస్తూ నేరుగా ప్రజలకు సంక్షేమం అందిస్తూ జగనన్న ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 34వ వార్డు కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా పార్టీ జెండా, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో 4,188 మంది లబ్ధిదారులకు రూ.20 కోట్ల మేర లబ్ధి చేకూర్చామన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, లండా రమణ, లింగం శ్రీనివాసరావు, తాతబ్బాయి, రాములమ్మ, దూడ అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలి..
రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మండల అధ్యక్షుడు బాపూ ఆనంద్ అన్నారు. 32వ వార్డు పరిధి అల్లిపురం–1 సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వార్డు ఇన్‌చార్జి మూలే రామిరెడ్డితో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోణి దేవ, బంగారమ్మ, గోవింద్, బాబుల్ శ్రీను, మల్ల కోటి, కొణతాల కృష్ణవేణి, యలమశెట్టి లక్ష్మి, ఉగ్గిన భవానీ, భానుమూర్తి, ఆదిబాబు, తిరుపతిరెడ్డి, దల్లి శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్..
డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు అఫీషియల్ కాలనీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి సంక్షేమ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అఫీషియల్ కాలనీ సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద మొత్తంగా 1590 మంది లబ్ధిదారులకు రూ. నాలుగున్నర కోట్లు అందించామంటే పేదల పట్ల జగనన్నకున్న అంకిత భావం అర్థం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

36వ వార్డులో..
జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధి సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసిపోగు రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి సనపల రవీంద్రభరత్ నిర్వహించి సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. కుందేటి సుధాకర్, కడితి రవణమ్మ, కాకి పద్మ, రమణి, కడియం ప్రసాద్, ఈస్వర్ కిషోర్, చెన్నా శ్రీధర్, నర్సింగ్, కనకమహాలక్ష్మి, దనాల రాంబాబు, స్మిత్, వడ్డాది మంగ వెంకట రత్నం, చెన్నా మాలతి, వై. కృష్ణవేణి, సరోజిని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



33వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : నియోజకవర్గాన్ని ఎలాంటి సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 33వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డు, గౌరీ స్ట్రీట్, ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సంక్షేమ పాలనపై వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో గల పబ్లిక్ టాయిలెట్స్‌ను తొలగించాలని స్థానికులు అభ్యర్థించారు. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతుందని వాపోయారు. ఈ మేరకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట మండల అధ్యక్షులు కర్రి నీలకంఠం, బాపూ ఆనంద్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, బొడ్డేటి ప్రసాద్, పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్, భాను, కొల్లు సత్యవతి, గంగ, తాడి సత్యవతి, అనురాధ, వలిశెట్టి లక్ష్మి, పీవీఎస్ రెడ్డి, బోణి దేవ, జెడ్సీ శివప్రసాద్, ఇంజినీరింగ్ సిబ్బంది, ఏపీఈపీడీసీఎల్ ఏఈ మహ్మద్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేరీమాత భక్తులకు ఉచిత భోజనం



అన్నదానం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్ : కొండగుడి పండగ నేపథ్యంలో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ మేరీమాత కొండ గుడి భక్తులకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉచిత భోజనం అందించింది. ఎన్ఆర్ఐ భరత్ మట్టపర్తి సహకారం, రౌండ్ టేబుల్, లేడీస్ సర్కిల్ సభ్యుల ఆర్థిక సహకారంతో స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వివేకానంద సంస్థ ఈ విధంగా ఉచిత భోజనాలు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, రౌండ్ టేబుల్, లేడీస్ సర్కిల్ సభ్యులు మక్సూద్ అహ్మద్, సందీప్‌రెడ్డి, అల్కా రాజ్‌పుట్, కల్యాణ్ ఆదిత్య, రవి నలమోతు, సంస్థ సభ్యులు సీహెచ్ పోతురాజు, సత్తిబాబు, అప్పలకొండ, భానోజీరావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

9 నుంచి గర్భస్థ శిశువుల ఆరోగ్యంపై సమావేశాలు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

మహారాణిపేట : ఈనెల 9 నుంచి రెండు రోజుల పాటు విశాఖలో గర్భస్థ శిశువు ఆరోగ్యంపై సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సొసైటీ ఆఫ్ ఫెటల్ మెడిసిన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ కేవీ శ్రీదేవి తెలిపారు. ప్రసూతి వైద్యం, మాత-శిశు ఆరోగ్యంలో వస్తున్న అధునాతన వైద్య ప్రక్రియలపై చర్చించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఉన్న 300 మంది సభ్యులు ఈ సమావేశాలకు హాజరవుతారని తెలిపారు. డాప్లర్ స్కాన్, బాలింతలకు వచ్చే హైపర్ టెన్షన్, వంశ పారంపర్య వ్యాధులపై కూడా చర్చ జరుగుతుందన్నారు. గీతం ఆస్పత్రిలో జరిగే ఈ సమావేశాలలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జీఐఎంఎస్ఆర్) ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గీతాంజలి ముఖ్య అతిథిగా, ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ సుబ్బరాజు, టి.రాధ, డాక్టర్ సీతారామరాజు, సీహెచ్ నారాయణరావు తదితరులు పాల్గొంటారని వివరించారు.

ఉత్సవాల్లో బాలల సదుపాయాలపై సమీక్ష

డాబాగార్డెన్స్ : ఈ నెల 13 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాల్లో బాలల పరిరక్షణకు ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు శీతారాం సూచించారు. దేవస్థాన ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తల్లులు పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేక కేబిన్లు, దివ్యాంగ బాలల దర్శనానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

కేజీహెచ్‌లో రక్త పరీక్షల కేంద్రం ప్రారంభం



రక్త పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌లో అవుట్ పేషెంట్స్ సౌకర్యార్థం రక్త పరీక్షల కేంద్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, ఏఆర్ఎంవో డాక్టర్ జగదీష్, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

18న డాక్ అండ్ పెన్షన్ అదాలత్

మహారాణిపేట : ఈనెల 18న 98వ డాక్ అండ్ పెన్షన్ అదాలత్ కార్యక్రమం విశాఖలో నిర్వహిస్తున్నట్టు ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు అదాలత్‌లో అర్హులు పాల్గొనవచ్చని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలియజేశారు.

పుస్తక మహోత్సవానికి చక్కటి ఆదరణ



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రముఖ వైద్యుడు పెద వీర్రాజు

మహారాణిపేట : విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు చక్కటి ఆదరణ లభిస్తోంది. నవయుగ వైతాళికులైన గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు రచనలు, అఖిల భారత స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన రాహుల్ సాంకృత్యాయన్, కిషన్ చందర్ వంటి ప్రముఖుల రచనలు, కందుకూరి, శ్రీశ్రీ, తాపీ ధర్మారావు, ఆరుద్ర, కొడవటిగంటి, రావిశాస్త్రి వంటి ముందు తరం రచయితల కథలు, నవలలు ప్రదర్శనలో ఉన్నాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణమైన టర్నర్ సత్రంలో ప్రతి రోజు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సాహితీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిపై విశాలాంధ్ర మేనేజర్ పీఏ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది 40 వేల పుస్తకాలతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదరణ దృష్ట్యా ఈసారి మూడు వారాల పాటు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుని భార్య లక్ష్మికి బీమా సొమ్ము అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన గృహసారథి సూరాడ రమణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో అతని భార్య లక్ష్మికి వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి తక్షణ సహాయం కింద రూ.10 వేల బీమా సొమ్ము అందజేశారు. త్వరలోనే మిగిలిన సొమ్మును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, రాములమ్మ, వెల్ఫేర్ సెక్రటరీ రొంగలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.